క్లుప్తంగా

నేడు వ్యవసాయ మార్కెట్ బంద్

మహబూబాబాద్ రూరల్: అకాల వర్షాల సూచన కారణంగా మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్ శుక్రవారం బంద్ ఉంటుందని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కత్తెరసాల విద్యాసాగర్ గురువారం తెలిపారు. ఎండ తీవ్రత కారణంగా జూన్ మొదటి వారం వరకు ప్రతి బుధవారం మార్కెట్ యార్డ్ బంద్ ఉంటుందని తెలిపారు.

ఎంపీ పూజలు

గూడూరు: గ్రామ దేవతగా తండావాసులందరినీ చల్లంగ చూడమని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు, ఎంపీ మాలోతు కవిత, ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ కోరారు. మండలంలోని ఎర్రకుంటతండాలో గురువారం బొడ్రాయి పునఃప్రతిష్ఠ కార్యక్రమంలో వేర్వేరుగా పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమంలో ఎర్రకుంటతండా సర్పంచ్ రాజశేఖర్, కేఎస్ఎన్ రెడ్డి, ముత్యం వెంకన్నగౌడ్, జెడ్పీ కోఆప్షన్‌లు మహబూబ్ పాషా, ఖాసీం పాల్గొన్నారు.

బొడ్రాయి పునఃప్రతిష్ఠాపనోత్సవం

మహబూబాబాద్ రూరల్: మండలంలోని సోమ్లాతండా గ్రామంలో బొడ్రాయి పునఃప్రతిష్ఠ, ముత్యాలమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ, మహా పూర్ణాహుతి పూజా కార్యక్రమాలు గురువారం అత్యంత వైభవంగా జరిగాయి. ఎంపీ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు మాలోత్ కవిత పాల్గొని బొడ్రాయి, ముత్యాలమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కేఎస్ఎన్ రెడ్డి, ముత్యం వెంకన్న, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు మహబూబ్ పాషా, నూనావత్ ఇస్తారి, టీపీసీ సభ్యుడు పొన్నాల యుగేందర్, తదితరులు పాల్గొన్నారు.

సీజ్ చేసిన వాహనాలకు రేపు వేలం

తొర్రూరు: గుడుంబా రవాణా, తయారీ సంబంధిత కేసుల్లో సీజ్ చేసిన వాహనాలకు ఈనెల 13న వేలం నిర్వహించనున్నట్లు ఎక్సైజ్ సీఐ అశోక్ గురువారం తెలిపారు. పట్టణంలోని ఎక్సైజ్ కార్యాలయంలో ఉదయం 10గంటలకు వేలం ప్రారంభమవుతుందని ఆసక్తిగల వారు కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

విరాళాల అందజేత

గార్ల: మండలంలోని మర్రిగూడెం వేట వేంకటేశ్వరస్వామి దేవాలయం అభివృద్ధికి గురువారం దాతలు విరాళాన్ని అర్చకుడు మధుస్వామికి అందజేశారు. పుల్లఖండం లక్ష్మణరావు జ్యోతి దంపతులు రూ.50వేలు, భువనగిరి నాగేశ్వరరావు, రూప్‌చంద్ మహవీర్ ప్రసాద్ జైన్, కల్వకుంట్ల లోకేశ్వరరావు, పెండ్యాల సూర్యనారాయణ కుమారులు చెరో రూ.25వేల చొప్పున నగదును దేవాలయ అభివృద్ధికి విరాళంగా అందజేశారు.


గాలివాన బీభత్సం



బయ్యారం: భీరోనిమడుమ గ్రామంలో విరిగిన విద్యుత్ స్తంభం


బయ్యారం: మండలంలోని భీరోనిమడువ గ్రామంలో బుధవారం రాత్రి గాలివాన బీభత్సం సృష్టించింది. భారీగా వచ్చిన గాలితో గ్రామానికి విద్యుత్ సరఫరా అయ్యే స్తంభాలు విరిగిపడగా ఇంటిపై కప్పుగా ఉన్న రేకులు లేచిపోయాయి.

లేచిపోయిన ఇంటి రేకులు



గార్ల: మండలంలోని ఆంగోత్‌తండాలో గురువారం వీచిన ఈదురు గాలులకు బీమ్లాకు చెందిన ఇంటి పైకప్పు రేకులు ఎగిరిపోయాయి.

వేసవిలో కూల్‌గా..



బావిలో ఈత కొడుతున్న యువకులు

మరిపెడ రూరల్: వేసవి కాలం కావడంతో ఎండ తీవ్రత అధికంగా ఉండడంతో ఉక్కపోతకు ప్రజలు తట్టుకోలేక పోతున్నారు. ఈత కొడుతూ యువత వేసవి తాపానికి ఉపశమనం పొందుతున్నారు. వేసవి సెలవుల్లో పట్టణాల నుంచి పల్లెలకు వచ్చిన యువకులు వేసవి ఉష్ణోగ్రతలు తట్టుకోలేక బావిలో ఈత కొడుతూ సేద తీర్చుకోవడం విశేషం. మండలంలోని చింతలగడ్డతండా గ్రామ పంచాయతీ పరిధిలోని ఓ వ్యవసాయ బావిలో ఈత కొడుతూ యువత సందడి చేశారు.

పనులతో ధ్వంసమైన రోడ్లు

- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- ప్రధానంగా మిషన్ భగీరథ పనులతో ఆగమాగం
- ముందస్తు ప్రణాళిక లేకపోవడంతోనే..



సర్వేపల్లి రాధాకృష్ణన్ సెంటర్‌లో పనులతో దెబ్బతిన్న రోడ్డు

మహబూబాబాద్: మానుకోట మున్సిపాలిటీ పరిధిలో పలు పనులతో ప్రధానంగా మిషన్‌భగీరథ పనులతో రోడ్లన్నీ పూర్తి దెబ్బతిన్నాయి. కోట్ల రూపాయలతో వేసిన రోడ్లను సైతం ధ్వంసం చేశారు. ముందస్తు ప్రణాళికతో పనులు చేయకపోవడంతో ఇలాంటి సమస్యలు తలెత్తుతున్నాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

మానుకోట మున్సిపాలిటీ పరిధిలో ప్రస్తుతం మిషన్ భగీరథ పనులతోపాటు ఇతర పనులు నిర్వహిస్తున్నారు. మిషన్ భగీరథ పనుల్లో భాగంగా మూడు రోజుల నుంచి ప్రధాన రోడ్లను ధ్వంసం చేసి పైపులైన్‌లు వేస్తున్నారు. ఆ పనుల్లో భాగంగా కంకరబోడ్ నుంచి సర్వేపల్లి రాధాకృష్ణన్ సెంటర్ వరకు ఇటీవల వేసిన రోడ్డు సగం వరకు ధ్వంసం చేశారు. దీంతో ఆ ప్రాంతంలో ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే శ్రీనివాస సెంటర్ నుంచి రామమందిరం వరకు రోడ్లతోపాటు డ్రెయినేజీని కూడా ధ్వంసం చేశారు. ఆప్రాంతంలో జరుగుతున్న పనులతో రైల్వే ప్రయాణికులతో పాటు వాహనదారులు ఇబ్బందులు పడుతుండడంతోపాటు ట్రాఫిక్ సమస్య తలెత్తుతుంది. జిల్లా ప్రదాన వైద్య శాల ఎదుట , నెహ్రూసెంటర్ తదితర ప్రాంతాలతో పాటు పత్తిపాక రోడ్డులో రోడ్లు చాలా వరకు దెబ్బతిన్నాయి. గుంతల మూలంగా ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. పనుల వద్ద కనీసం హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేయడం లేదు. దాంతో పలు పనులతో పట్టణంలో కొత్త బజార్ రహదారులన్నీ చాలా వరకు దెబ్బతిన్నాయి. రోడ్డు కటింగ్ లేకుండానే పైప్‌లైన్ వేసేందుకు ప్లాన్ చేసినా అలా సాధ్యం కాకపోవడంతో పైప్‌లైన్ గ్యాప్‌ల కోసమే రోడ్ల కటింగ్ చేస్తున్నారని మున్సిపల్ ఏఈ సురేష్ చెబుతున్నారు. కేవలం కిలోమీటర్ మేరకే రోడ్లు ధ్వంసం అయినట్లు చెబుతున్నా అంతకంటే ఎక్కువ సుమారు రెండు కిలోమీటర్ల మేరకు రోడ్లు ధ్వంసం అయ్యాయి.

తూతూ మంత్రంగా మరమ్మతు పనులు

రోడ్ల మరమ్మతులు చేసినా తూతూమంత్రంగా చేస్తున్నారు. నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదు. ధ్వంసం చేసిన వాటినే గుంతలలో వేసి కాంక్రీట్ వేస్తున్నారు. దీంతో వేసిన మరుసటి రోజే చిన్న చిన్న గుంతలు పడుతున్నాయి. వెంటనే పనులు పూర్తి చేసి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని వాహనదారులు ప్రజలు కోరుతున్నారు.

డిమాండ్లు నెరవేర్చే వరకూ సమ్మె



మహబూబాబాద్ రూరల్: సమ్మెకు మద్దతు తెలుపుతున్న నాయకులు

మహబూబాబాద్ రూరల్: మండల పరిషత్ కార్యాలయం ఎదురుగా పంచాయతీ కార్యదర్శులు చేపట్టిన సమ్మె గురువారం 14వ రోజుకు చేరింది. సమ్మెకు తెలంగాణ జన సమితి జిల్లా అధ్యక్షులు డాక్టర్ డోలి సత్యనారాయణ, తెలంగాణ మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షులు పిల్లి సుధాకర్, టీఎస్ ఆర్టీసీ యూనియన్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్, టీపీటీఎఫ్ జిల్లా బాధ్యులు ఉపేందర్, ఐఎఫ్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బిల్లకంటి సూర్యం, తదితరులు మద్దతు తెలిపారు.

డోర్నకల్: ప్రభుత్వ ఒత్తిళ్ల నేపథ్యంలో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు సమ్మెను కొనసాగిస్తున్నారు. మండలంలో 26 మంది కార్యదర్శులు ఉండగా ఇద్దరు కార్యదర్శులు విధుల్లో చేరగా 24మంది సమ్మెలో కొనసాగుతున్నారు. గురువారం 14వ రోజు సమ్మెలో పాల్గొన్న కార్యదర్శులు మాట్లాడుతూ.. తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చే వరకు సమ్మె కొనసాగిస్తామని తెలిపారు.

సద్వినియోగం చేసుకోవాలి

డోర్నకల్: వేసవి సెలవులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ వాంకుడోత్ వీరన్న తెలిపారు. స్థానిక జెడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులకు వేసవి శిక్షణా శిబిరం జరుగుతుండగా కౌన్సిలర్ సురేందర్‌జైన్ భోజనం కోసం గురువారం 25కేజీల బియ్యం అందించారు. కార్యక్రమంలో సుధాకర్, వీరన్న, రాంబాబు పాల్గొన్నారు.

వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణ మహోత్సవం

తొర్రూరు: డివిజన్ కేంద్రంలోని ఆలయంలో వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణ మహోత్సవం గురువారం వైభవంగా నిర్వహించారు. ఆలయ 18వ వార్షికోత్సవంలో భాగంగా పురోహితులు ఇటికేల విశ్వప్రకాశాచార్యుల సమక్షంలో పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి, గోవిందమాంబల కల్యాణం జరిపించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు కల్లూరి నాగేంద్రాచారి, ప్రతినిధులు పూర్ణాచారి, చంద్రశేఖరాచారి, రామేశ్వరాచారి, సదానందచారి పాల్గొన్నారు.

కొనుగోళ్లు చేపట్టాలని ఆందోళన



ఆందోళన చేస్తున్న రైతులు

గార్ల: గార్లలో వరిధాన్యం కొనుగోళ్లు వెంటనే చేపట్టాలని డిమాండ్ చేస్తూ సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో గురువారం స్థానిక మార్కెట్ యార్డులో రైతులు ఆందోళన చేపట్టారు. ఈసందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కందునూరి శ్రీనివాసరావు మాట్లాడారు. మార్కెట్‌లో ధాన్యం ఆరబోసుకొని 25 రోజులు గడుస్తున్నా నేటికీ కొనుగోలు కేంద్రం ప్రారంభించక పోవడంతో అకాల వర్షాలకు ధాన్యం తడిసిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని రైతులు వేడుకుంటున్నారు. ఉపసర్పంచ్ లోకేశ్వరరావు, రైతులు వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

భూకేటాయింపు

తొర్రూరు రూరల్: మండలంలోని సోమారం గ్రామంలో ఆరోగ్య ఉప కేంద్రం ఏర్పాటు కోసం రెవెన్యూ విభాగం ఆధ్వర్యంలో భూమిని కేటాయించారు. గురువారం మండలంలోని సోమారంలో భూ కేటాయింపు సంబంధిత పత్రాలను డాక్టర్ జ్వలితకు తహసీల్దారు నాగేంద్రప్రసాద్ అందించారు.

మంత్రి చొరవతో మండల అభివృద్ధి



సీఎం, మంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ప్రజాప్రతినిధులు

పెద్దవంగర: మంత్రి దయాకర్‌రావు చొరవతో మండలం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందుతుందని ఎంపీపీ ఈదురు రాజేశ్వరీ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఐలయ్యలు అన్నారు. మండలంలోని చిట్యాల గ్రామంలో అభివృద్ధి పనులకు ప్రభుత్వం నిధులు మంజూరుపై గురువారం గ్రామంలో సీఎం కేసీఆర్, మంత్రి దయాకర్‌రావు చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. పంచాయతీ భవన నిర్మాణానికి రూ.20 లక్షలు, 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణానికి రూ.1.94 కోట్లు మంజూరయ్యాయని, త్వరలోనే పనులు పూర్తి చేస్తామని ఎంపీపీ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ రావుల శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు వసంత, సుదర్శన్, హరీశ్, మహేష్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న వీఓఏల నిరసన



గార్ల: సీఎంకు పోస్టుకార్డు పంపిస్తున్న వీఓఏలు

గార్ల: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం వీఓఏలు పోస్టుకార్డుల ద్వారా సీఎం కేసీఆర్‌కు పోస్ట్ చేస్తు నిరసన తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ కందునూరి శ్రీనివాసరావు, వీఓఏలు ఉమ, వినోద, రజిని, శ్రీజ, తదితరులు పాల్గొన్నారు.

గూడూరు: వీఓఏల డిమాండ్లను పరిష్కరించాలని సంఘం జిల్లా కన్వీనర్ చింత మౌనిక డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో సమస్యల పరిష్కారం కోసం వీఓఏలు చేపట్టిన నిరవధిక సమ్మె గురువారం నాటికి 25వ రోజుకు చేరుకుంది. వారికి వీఓ ఓబీలు మద్దతు పలికారు. కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు కొట్టెం సునీత, రాధ, సంఘం మండల అధ్యక్షురాలు దారం శ్రీలత, పురుషోత్తం, భారతి పాల్గొన్నారు.

15నుంచి సీఎం కప్ క్రీడా పోటీలు



డోర్నకల్: మాట్లాడుతున్న ఎంపీపీ

డోర్నకల్: ఈనెల 15నుంచి మూడు రోజులపాటు నిర్వహించే మండల స్థాయి సీఎం స్పోర్ట్స్ కప్ నిర్వహన కోసం గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పీఈటీలతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఎంపీపీ ధరంసోత్ బాలునాయక్ మాట్లాడుతూ.. ఈనెల 15 నుంచి 17వ తేదీ వరకు వాలీబాల్, ఫుట్‌బాల్, ఖోఖో, కబడ్డీ, అథ్లెటిక్స్ క్రీడల్లో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 36 సంవత్సరాలలోపు స్త్రీ, పురుష క్రీడాకారులు క్రీడల్లో పాల్గొనే జట్ల వివరాలను సర్పంచులు 13వ తేదీ మధ్యాహ్నం లోగా ఎంపీఈఓ కార్యాలయంలో అందజేయాలని కోరారు. స్థానిక క్రీడాకారులు మాత్రమే పోటీలలో పాల్గొనాలని సూచించారు. 14వ తేదీన టీంలను ఎంపిక చేసి 15వ తేదీ ఉదయం 8 గంటలకు క్రీడా పోటీలను ప్రారంభించనున్నట్లు ఎంపీపీ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అపర్ణ, మున్సిపల్ చైర్మన్ వాంకుడోత్ వీరన్న, కమిషనర్ శ్రీనివాసరావు, తహసీల్దార్ స్వాతిబిందు, తదితరులు పాల్గొన్నారు.

చిన్నగూడూరు: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశానుసారం ఈనెల 15, 16, 17 తేదీలలో జరిగే సీఎం కప్ పోటీల నిర్వహణలో భాగంగా మండల కేంద్రంలో జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో యువతకు క్రీడలు నిర్వహించనున్నట్లు ఎంపీపీ పద్మ వెంకట్ రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాల ప్రాంగణంలో ఎంపీపీ అధ్యక్షతన గురువారం సమావేశం నిర్వహించారు.మండలంలోని అన్ని గ్రామాల నుంచి యువతను క్రీడల్లో పాల్గొనేలా ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పూర్తి బాధ్యత వహించి క్రీడాకారులను పోత్సహించాలని ప్రజాప్రతినిధులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ రామకృష్ణ, ఎంపీడీఓ శ్యాంసుందర్, సర్పంచ్ మల్లయ్య, పీఈటీ పుష్పలీల, శ్రీనివాస్, పోలీస్ సిబ్బంది గఫర్ ఉన్నారు.

బయ్యారం: ఈనెల 15 నుంచి 17 వరకు బయ్యారంలోని క్రీడామైదానంలో మండల స్థాయి చీఫ్ మినిస్టర్ కప్ క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు ఎంపీపీ చేపూరి మౌనిక తెలిపారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో క్రీడాపోటీలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమేష్, ఎంపీడీఓ చలపతిరావు, ఎస్సై రమాదేవి, సర్పంచ్ కోటమ్మ, ఎంపీఓ వెంకటరమణ, హెచ్ఎం పద్మ పాల్గొన్నారు.

మొలకెత్తిన కష్టం..



అకాలవర్షాలతో మొలకెత్తిన కంకులు

కేసముద్రం: ఆరుగాలం శ్రమించి రైతులు పండించిన పంటలను అకాలవర్షాలు దెబ్బతీశాయి. వరి, మొక్కజొన్న, మామిడి ఇతర పంటలు నేటమట్టమయ్యాయి. ముఖ్యంగా వరితో పాటు మొక్కజొన్న రైతులు కోలుకోలేని విధంగా పంటలు నష్టపోయారు. మండలంలోని కేసముద్రం విలేజ్‌కి చెందిన బండి సూరమ్మ అనే మహిళా రైతు తనకున్న 2 ఎకరాల్లో మొక్కజొన్న పంటను సాగుచేయగా, పంటకు రూ.50 వేల వరకు ఖర్చు వచ్చింది. తీరా పంట చేతికందే దశలో అకాలవర్షాలు కురవడంతో, పంట నేలవాలింది. తీరా కంకులను ఏరే దశలో కంకులన్నీ మొలకలు రావడంతో, ఆ మహిళా రైతు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తోంది. ప్రభుత్వం స్పందించి తమకు వెంటనే పరిహారం అందించాలని పలువురు రైతులు కోరుతున్నారు.

ప్రతి వార్డుకు రూ.కోటి కేటాయించాలి



ఎంపీ కవితకు వినతిపత్రం ఇస్తున్న కౌన్సిలర్లు

మహబూబాబాద్: సీఎం కేసీఆర్ మానుకోట మున్సిపాలిటీకి కేటాయించిన రూ.50 కోట్లలో ప్రతివార్డుకు రూ.కోటి కేటాయించాలని మున్సిపల్ ఫ్లోర్ లీడర్లు బి. అజయ్‌సారథిరెడ్డి, సూర్నపు సోమయ్య, బీఆర్ఎస్ కౌన్సిలర్ ఎడ్ల వేణుమాధవ్, కౌన్సిలర్ పోతురాజు రాజు డిమాండ్ చేశారు. స్థానిక ఎంపీ క్యాంపు కార్యాలయంలో సీపీఐ, సీపీఎం, బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీకి చెందిన కౌన్సిలర్లు గురువారం ఎంపీ మాలోత్ కవితను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు విజయమ్మ, హరిసింగ్, నీరజారెడ్డి ధర్మన్న, పద్మ, నాగలక్ష్మి, కోఆప్షన్ సభ్యుడు నిమ్మల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతను వంచిస్తున్న ప్రభుత్వం



మాట్లాడుతున్న రాంరెడ్డి

తొర్రూరు: అసంబద్ధ ఉపాధి కల్పన విధానాలతో రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ యువతను వంచిస్తుందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జక్కుల రాంరెడ్డి తెలిపారు. గురువారం డివిజన్ కేంద్రంలో కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో రాంరెడ్డి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ పాలనలో నిరాశ చెందిన నిరుద్యోగ యువతకు ధైర్యం కల్పించేందుకే ప్రియాంక గాంధీ హైదరాబాద్‌లో కాంగ్రెస్ యూత్ డిక్లరేషన్ ప్రకటించారన్నారు. ప్రియాంక గాంధీపై మంత్రి దయాకర్‌రావు అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. కాంగ్రెస్ హయాంలోనే యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించబడ్డాయని గుర్తు చేశారు. కార్యక్రమంలో నాయకులు జాటోతు రవి నాయక్, సుంచు సంతోష్, కందాడి అశోక్‌రెడ్డి, మేకల కుమార్, వెంకటాచారి, కర్ర అశోక్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

క్రీడలతోనే సంపూర్ణ ఆరోగ్యం



పండ్లు పంపిణీ చేస్తున్న భద్రినారాయణ

మహబూబాబాద్ అర్బన్: క్రీడలతోనే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షులు భద్రినారాయణ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో సమ్మర్ క్యాంప్ నిర్వహించగా క్రీడాకారులకు పండ్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంప్‌లను క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ బాలుర పాఠశాల నోడల్ హెచ్‌ఎం వెంకటేశ్వరరావు, పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం కె.వాసుదేవ్, పీఈటీలు చాంప్లానాయక్, ప్రవీణ్, సునీత, క్రీడాకారులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

స్థల పరిశీలన

డోర్నకల్: డోర్నకల్ మున్సిపాలిటీ పరిధిలో దోబీఘాట్ ఏర్పాటు కోసం రూ.2 కోట్లు మంజూరయ్యాయి. బైపాస్ రోడ్డులో దోబీఘాట్ ఏర్పాటు కోసం తహసీల్దార్ స్వాతిబిందు, మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాసరావు, సర్వేయర్ వెంకన్న స్థల పరిశీలన జరిపారు.

విద్యార్థులకు సన్మానం



డోర్నకల్: ఇటీవల ప్రకటించిన ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో బైపీసీ గ్రూపు నుంచి గణేష్ సాయి 989 మార్కులు సాధించాడు. గురువారం ఎంపీ కవిత గణేష్‌సాయిని శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు సతీష్‌కుమార్ గౌడ్, కాడెం ప్రశాంత్, వీరభద్రం, చిరంజీవి పాల్గొన్నారు.

కురవి: సీరోలు, కురవి మండలాల్లోని జెడ్పీ హైస్కూల్స్, నేరడ మోడల్ స్కూల్ విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరిచారు. మోద్గులగూడెం హైస్కూల్ విద్యార్థి వంశీకి 10/10 జీపీఏ సాధించడంపై పాఠశాల హెచ్‌ఎం బానోత్ శంకర్‌నాయక్, ఉపాధ్యాయులు గురువారం పాఠశాలలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అప్పారావు, వీరయ్య, కేఎస్ఎస్ లత, కరుణ, దీపిక, ఇందిర, సునీత, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

అనుమతి లేకుండా నిర్మాణాలు చేపట్టొద్దు

గార్ల: మండలంలోని మర్రిగూడెం వేట వేంకటేశ్వరస్వామి దేవాలయం ప్రాంగణంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారుల అనుమతి లేకుండా ఎలాంటి భూమి పూజలు, నిర్మాణాలు చేపట్టరాదని జిల్లా ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ నందనం కవిత గురువారం తెలిపారు.

షెడ్ నిర్మాణానికి భూమిపూజ

గార్ల: మండలంలోని మర్రిగూడెం వేట వెంకటేశ్వరస్వామి దేవాలయం ప్రాంగణంలో నూతన షెడ్ నిర్మాణానికి ఆలయ అర్చకులు మధుస్వామిచే భూమిపూజ చేయించారు. కార్యక్రమంలో భక్తులు వెంకట్రామయ్య, రమేష్‌బాబు, రామారావు, భూక్యా రాములు, తదితరులు పాల్గొన్నారు.

'కంటి వెలుగు' ప్రారంభం

కేసముద్రం: మండలంలోని సర్వాపురంతండా జీపీలో గురువారం కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజాప్రతినిధులు ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ రావుల నవీన్‌రెడ్డి, ఉపసర్పంచ్ బాలాజీ, వైద్యులు శ్రావణ్‌కుమార్, వార్డుసభ్యులు, ఎఎన్ఎం, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

108 వాహనంలో ప్రసవం

డోర్నకల్: మండలంలోని కొత్త దుబ్బతండా శివారు కొత్త తండా చెందిన గర్భిణి పద్మకు గురువారం పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108కి సమాచారం అందించారు. పద్మను వాహనంలో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో పండంటి బాబుకు జన్మనిచ్చింది. కుటుంబ సభ్యులు సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు.

భూహక్కు పత్రాల పరిశీలన



డోర్నకల్: గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణంలో వినియోగిస్తున్న భూములకు సంబంధించిన హక్కు పత్రాలను గురువారం తహసీల్దార్ కార్యాలయంలో పరిశీలించారు. నాగపూర్ నుంచి విజయవాడ వరకు ఏర్పాటు చేస్తున్న గ్రీన్‌ఫీల్డ్ హైవే రోడ్డు నిర్మాణం డోర్నకల్ మండలంలోని పెరుమాళ్లసంకీస, కన్నెగుండ్ల, వెన్నారం గ్రామాల మీదుగా కొనసాగనుంది. తహసీల్దార్ స్వాతిబిందు రైతులతో మాట్లాడుతూ.. రైతుల భూములకు చెందిన హక్కు పత్రాలను మాత్రమే పరిశీలిస్తున్నట్లు తెలిపారు.

వైభవంగా భోగ్‌భండారో

కురవి: మండలంలోని కొత్తూరు(జీ) గ్రామ శివారు బంచరాయి తండా జీపీలో గురువారం శ్రీ బుడియాబాపు మహాపూజ భోగ్ భండారో కార్యక్రమంలో వైభవంగా సీతారాంసాధు నేతృత్వంలో జరిగింది. కార్యక్రమంలో సక్రాం, అశోక్‌వస్య సాధు, రాములు సాధు, వినోద్, మోహన్, చిన్న, ఉదయ్ పాల్గొన్నారు.

తండాల అభివృద్ధికి కృషి

మరిపెడ రూరల్: తండాల అభివృద్ధికి సీఎం కేసీఆర్ ఎంతో కృషి చేస్తున్నారని ఎంపీపీ గుగులోతు అరుణ అన్నారు. మండలంలోని బాల్యతండా గ్రామ పంచాయతీ పరిధిలో నిర్మిస్తున్న నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులను జెడ్పీటీసీ శారదతో కలిసి ఎంపీపీ గురువారం పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా రైతు సమన్వయ సభ్యులు కాలునాయక్, ఎంపీటీసీ సభ్యులు జిక్కినారాయణ, పీఏసీఎస్ డైరెక్టర్ బానోత్ హరినాయక్ పాల్గొన్నారు.

చెక్కు అందజేత

గార్ల: మండలంలోని ముల్కనూరు పంచాయతీ బుడిగజంగాల కాలనీకి చెందిన కడియం వెంకటేష్‌కు మంజూరైన రూ.37,500 సీఎంఆర్ఎఫ్ చెక్కును గురువారం సీపీఎం మండల కార్యదర్శి కందునూరి శ్రీనివాసరావు అందజేశారు.

పరిహారం చెల్లించాలి

మరిపెడ: అకాల వర్షాల కారణంగా మామిడి, వరి, మిర్చి ఇతర పంటలు నష్టపోయిన రైతులకు తక్షణమే నష్టపరిహారం అందించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బానాల రాజన్న గురువారం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దేవయ్య, అనంతచారి తదితరులున్నారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి

కురవి: కురవి శివారు రేకుల తండా జీపీకి చెందిన గుగులోత్ బిక్కుకు చెందిన ఎద్దు మేత కోసం విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలోకి వెళ్లింది. సబ్‌స్టేషన్ పక్కన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు అమర్చిన సపోర్ట్ తీగకు తగలగానే విద్యుత్‌షాక్‌తో ఎద్దు అక్కడికక్కడే మృతి చెందింది.

మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ కన్నుమూత

డోర్నకల్: మహబూబాబాద్ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ చిర్రా శ్యామల(38) అనారోగ్యంతో బుధవారం రాత్రి మృతి చెందింది. గురువారం మున్సిపల్ చైర్మన్ వాంకుడోత్ వీరన్న, మార్కెట్ కమిటీ చైర్మన్ కత్తెరసాల విద్యాసాగర్, కౌన్సిలర్ శరత్, నాయకులు నివాళులర్పించారు.

కనీస వేతనం అమలు చేయాలి



నెహ్రూసెంటర్: పశు మిత్రులకు కనీస వేతనం అమలు చేయాలని పశుమిత్ర వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసు మాధవి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి కుంట ఉపేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని సంఘ కార్యాలయంలో గురువారం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. పశుమిత్రుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 17వ తేదీన జిల్లా డీఆర్‌డీఏ కార్యాలయ ముట్టడి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో యూనియన్ జిల్లా కార్యదర్శి శారద, ఝాన్సీ, సమత, కవిత, ఉమారాణి, జ్యోతి, ప్రమీల, తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
మహబూబాబాద్ : 9010144453
Office mail : wglsakshiadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఎస్.కె. అన్వర్, (S.R) : 7997958185
ఎం. మురళి, (S.R)(తొర్రూరు) : 7680822646